సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 25 । జనవరి । 2024



.. మనమే ప్రథమం

నూతన విద్యా విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు.

10లో



పాపం పసివాళ్లు...

అభం శుభం తెలియని ఆ చిన్నారులు ఆడుకుంటూ తమ నివాసం సమీపంలోని ఉమ్మెత్త చెట్టు కాయలు తిని అస్వస్థతకు గురయ్యారు.

10,950 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 10,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.55 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీలో నగదు రహిత లావాదేవీలు



నగదు రహిత లావాదేవీలు జరుపుతున్న ప్రయాణికుడు

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ప్రయాణికులకు నగదు రహిత లావాదేవీల ద్వారా టికెట్ పొందే సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ షేక్ షబ్నం పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోనికి వచ్చిన ఈ సౌకర్యం ద్వారా ప్రయాణికులు టికెట్ కొనుగోలు చేయవచ్చునన్నారు. ప్రయాణికులు టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకునే సమయంలో పేటీఎం, బీమ్, గూగుల్ పే, ఫోన్ పే వంటి వాటిని వినియోగించి నగరదు రహిత లావాదేవీలు జరిపి టికెట్ పొందవచ్చున్నారు. ఏపీఆర్ఎస్ కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ పేమెంట్లను అనుమతిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు నగర రహిత లావాదేవీలు జరిపి సౌకర్యవంతమైన ప్రయాణం పొందాలన్నారు.

వాయుసేనలో ప్రవేశానికి 6 వరకూ దరఖాస్తులు

అమలాపురం రూరల్: కేంద్రం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంలో భాగంగా వాయుసేనలో ప్రవేశానికి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో యువత దరఖాస్తు చేసుకోవచ్చని సికింద్రాబాద్ వాయుసేన చెందిన సార్జెంట్లు జీవన్ సింగ్, అనిల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అమలాపురంలో పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ వీవీ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనిల్ మాట్లాడుతూ ఇంటర్ నుంచే భారత వాయుసేనలో మంచి ఉద్యోగాన్ని పొందవచ్చన్నారు. కాగా.. విద్యార్థులను చైతన్య పరుస్తున్న సార్జెంట్లు జీవన్ సింగ్, అనిల్‌ను జేసీ నపూర్ అజయ్, డీఆర్వో సత్తిబాబు, డీవైఈఓ సత్యనారాయణరెడ్డి, ఏఈవో జి.సూర్య ప్రకాష్ అభినందించారు.

వాడపల్లి వెంకన్నకు రూ.కోటి ఆదాయం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.రూ 1,02,78,663 వచ్చినట్లు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ప్రధాన హుండీల నుంచి రూ 74,29,750, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ 28,48,913 సమకూరిందన్నారు. అలాగే విదేశీ కరెన్సీ, బంగారం 11 గ్రాములు, వెండి 739 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. హుండీల్లో పువ్వులు, కరెన్సీలు పాడైయ్యే వస్తువులు వేయరాదన్నారు. అలాగే ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ.2,54,454 లభించిందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో మందపల్లి మందేశ్వర స్వామి ఆలయ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ లక్ష్మి, పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి ఈవో ఎస్‌వీఎస్ఎన్ఎస్‌వీ ప్రసాదరాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం ఈవో ఎం.రాధకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఎస్సై బీవై కిరణ్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం



- ఉపాధి పథకంలో పారదర్శకతకు పెద్దపీట
- అవినీతిని నిగ్గుతేలుస్తున్న సామాజిక తనిఖీ బృందాలు
- గత ప్రభుత్వంలో అంతులేని అవినీతి
- ప్రభుత్వ సమర్థ చర్యలతో తగ్గిన స్వాహా పర్వం
- 2023లో జిల్లా వ్యాప్తంగా ఒక్కో మండలంలో 15 రౌండ్ల తనిఖీ
- రూ.1.25 కోట్లు పక్కదారి పట్టినట్లు నిర్ధారణ

సాక్షి, రాజమహేంద్రవరం: ఉన్న ఊళ్లోనే ఉపాధి కల్పించే ఉద్దేశంతో అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు సాంకేతికతను జోడిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నా... ప్రతి రూపాయి ఎలా ఖర్చవుతోందో తెలుసుకునేందుకు ఏటా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నా అక్రమాల పరంపర కొనసాగుతూనే ఉంది. మహత్తర లక్ష్యంతో అమలు చేస్తున్న పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వ యంత్రాంగం చర్యలకు ఉపక్రమిస్తోంది. సామాజిక తనిఖీలు చేపట్టి పక్కదారి పట్టిన సొమ్ము విషయం నిగ్గుతేలుస్తోంది. రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) చట్టం ప్రయోగించడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా పెడుతున్నారు. దోచేసిన నిధులు తిరిగి వసూలు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. వెరసి అవినీతి గణనీయంగా తగ్గుముఖం పట్టిందని అధికారుల నుంచి వినిపిస్తోంది.

జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పథకం అమలు చేస్తున్నారు. పనుల నిర్వహణ, నిధుల వెచ్చింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఈ క్రమంలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. గ్రామ సభల ద్వారా అవినీతికి సంబంధించిన కారణాలను ప్రజల ముందు ఉంచుతున్నారు. అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్న విషయంపై ప్రజలకు స్పష్టత ఇస్తున్నారు. ఇందులో భాగంగానే తూర్పుగోదావరి జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై కొన్ని మండలాల్లో 14, మరికొన్ని మండలాల్లో 15 విడతలుగా సామాజిక తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ రూ.1,25,51,608 కోట్లకు సంబంధించి తేడాలున్నట్లు సామాజిక తనిఖీ అధికారులు తేల్చారు. ఇందులో రూ.74,20,724 లక్షలకు సంబంధించిన లెక్కలు సరిదిద్దారు. రూ.48,64,110 లక్షలు స్వాహా చేసినట్లు తనిఖీ బృందాలు నిగ్గుతేల్చాయి. స్వాహా చేసిన రూ.48,64,110 లక్షల్లో ఇప్పటి వరకు రూ.13,56,022 లక్షలు రికవరీ చేశారు. ఇందులో అనపర్తి మండలంలో రూ.2,49,843, దేవరపల్లిలో రూ.700, నల్లజర్లలో రూ.1,69,473, నిడదవోలులో రూ.2,76,700, రాజమండ్రి రూరల్‌లో రూ.4,064, రంగంపేటలో రూ.242, గోపాలపురం మండలంలో రూ.6,55,000 రికవరీ చేసినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన మొత్తం వసూలు చేయాల్సి ఉంది. అవినీతికి పాల్పడిన, ఇందులో సంబంధం ఉన్న అధికారులపై క్రిమినల్ కేసులు సైతం బనాయిస్తున్నారు. ఆర్ఆర్ యాక్ట్ ద్వారా దోచుకున్న సొమ్మును రికవరీ చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఓ మండలంలో ఓ అధికారి జగనన్న ఇళ్లకు సంబంధించిన రూ.14 లక్షలు తన సొంత ఖాతాకు మళ్లించుకున్నారు. దీనిపై డ్వామా అధికారులు సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకున్నారు. అవినీతికి పాల్పడిన అధికారి ఏ స్థాయి అయినా చర్యలకు వెనుకాడటం లేదు. ఫలితంగా టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే.. ఈ ప్రభుత్వ హయాంలో అవినీతి తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

టీడీపీ హయాంలో అధ్వానం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పథకంలో అంతులేని అవినీతి చోటు చేసుకుంది. తమ అడుగులకు మడుగులొత్తే అధికారులతో చేయి కలిపిన ఆ పార్టీ నేతలు అక్రమాలకు తెర తీశారు. అధికారులను బలి పశువుల్ని చేసి రూ.కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారు. ఒక్క 2017–18 ఆర్థిక సంవత్సరంలోనే రూ.97 లక్షలు స్వాహా చేశారు. ఈ వ్యవహారంలో ఐదుగురు అధికారులను సస్పెండ్ చేసి, 184 మందిని ఏకంగా సర్వీస్ నుంచి తొలగించి, మరో 1,316 మందిపై చర్యలకు ఉపక్రమించారంటే టీడీపీ నేతలు ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చు. ఉపాధి పథకంలో రూ.లక్ష లోపు నిధులు దుర్వినియోగం చేసిన వారిపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగానికి సిఫారసు చేశారు. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 415 మంది ఉద్యోగులపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగించగా, వారి నుంచి రూ.1.67 కోట్ల రికవరీ చేయాల్సి ఉంది. ఈ మేరకు నోటీసులు కూడా జారీ చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు సైతం పెడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నలుగురిపై క్రిమినల్ కేసులు పెట్టారు. వీరి ద్వారా రూ.1.18 కోట్ల నగదు రికవరీకి ఆదేశించారు.

అనుబంధ శాఖల్లోనూ అదే తీరు

ఉపాధి హామీ పనుల్లోనే కాదు ఆ నిధులతో ఇతర శాఖల్లో చేపట్టే పనుల్లోనూ బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఒక్కో పంచాయతీరాజ్ శాఖలోనే ఏడుగురు ఎంపీడీఓలు రూ.2.11 కోట్లు, 24 మంది ఏఈఈ స్థాయి అధికారులు రూ.51 లక్షల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించి చర్యలకు ఉపక్రమించారు.

మొక్కుబడిగా నోటీసులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా దిగమింగిన సొమ్ము రికవరీ చేయడంలో అధికారులు పెద్ద మనసు చూపడం గమనార్హం. 2021వ సంవత్సరం వరకు ఉమ్మడి తూర్పుగోదావర జిల్లా వ్యాప్తంగా రూ.17.57 కోట్ల ఉపాధి నిధులు పక్కదారి పట్టాయి. ఇందులో రూ.8.64 కోట్లు అవినీతి జరిగిందని నిర్ధారణ అయ్యింది. అప్పటి వరకు కేవలం రూ.3.87 కోట్లు మాత్రమే రికవరీ చేపట్టారు. 415 మంది ఉద్యోగులపై ఆర్ఆర్ యాక్ట్ అమలు చేశారు. 16 ఏళ్ల క్రితం జరిగిన సామాజిక తనిఖీ సభల రికవరీలు కూడా జిల్లా విభజన సమయానికి పెండింగ్ ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అధికారులు మొక్కుబడిగా నోటీసులు అందించి చేతులు దులుపుకోవడం మినహా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడం కరువయిందన్నన్న విమర్శలు వినవస్తున్నాయి.

పక్కాగా రికవరీ



ఉపాధి పథకంలో అక్రమాలకు పాల్పడి, నిధులు దుర్వినియోగం చేసిన విషయాన్ని సామాజిక తనిఖీల ద్వారా గుర్తిస్తున్నాం. దుర్వినియోగమైన ప్రభుత్వ సొమ్ము వసూలుకు కృషి చేస్తున్నాం. అక్రమాలు చోటు చేసుకుంటే కూలీలు కూడా ఫిర్యాదు చేయవచ్చు. మేం సామాజిక తనిఖీలు చేపడతాం. తనిఖీలు పకడ్బందీగా చేపట్టి అవినీతిని నిగ్గు తేలుస్తాం. ఆఖరి అస్త్రంగా ఆర్ఆర్ చట్టాన్ని కూడా ప్రయోగిస్తాం.

– ఎ.ముఖలింగం, డ్వామా ఇన్‌చార్జి పీడీ, తూర్పుగోదావరి

2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇలా..

మండలం	సామాజిక తనిఖీ చేసిన రౌండ్లు	పక్కదారి పట్టిన సొమ్ము (రూ.లలో)	రికవరీకి ప్రతిపాదించిన సొమ్ము (రూ.లలో)
అనపర్తి	15	4,73,887	165
చాగల్లు	15	2,55,192	2,55,192
గోపాలపురం	14	48,96,701	15,72,642
కోరుకొండ	14	2,09,775	11,435
కొవ్వూరు	13	1,20,262	2,261
నల్లజర్ల	14	31,51,127	20,16,971
నిడదవోలు	14	1,56,292	127
పెరవలి	15	2,05,418	2,05,418
రాజమహేంద్రవరం రూరల్	15	11,40,009	2,54,934
రంగంపేట	14	8,30,108	76,039
తాళ్లపూడి	15	6,93,613	4,68,926
ఉండ్రాజవరం	15	2,66,774	2,66,774



చాగల్లులో సామాజికి తనిఖీ గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎంల తనిఖీ అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాధారణ తనిఖీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్‌ను భద్ర పరిచిన గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత తెలిపారు. బుధవారం ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే 2024 కి చెందిన ఓటరు తుది జాబితా ప్రకటించామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసి, రిజిస్టర్‌లో సంతకాలు చేశామన్నారు. భద్రతతో పాటు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ గోడౌన్‌కు మూడు షిఫ్టులలో పోలీసు భద్రత కల్పించామన్నారు. ఇప్పటికే ఈ కేంద్రంలో భద్రపరచిన జిల్లాకు కేటాయించిన 5,971 బ్యాలెట్ యూనిట్స్, 5,463 కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్ యూనిట్స్ 4,927ను సాంకేతికంగా తనిఖీ చేసి, వాటి పని తీరును పరిశీలించామన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలియజేశారు. మరణించిన ఓటర్ల తొలగింపు కోరుతూ జాబితా ఇచ్చామని, అయినా తొలగించ లేదని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓటరు యొక్క డెత్ సర్టిఫికెట్‌తో కూడిన ఫారం 7ను బీఎల్‌ఓ ద్వారా దరఖాస్తు చేస్తేనే ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని కలెక్టర్ మాధవీలత తెలియజేశారు. అర్బన్ తహసిల్దార్ వి.సుస్వాగతం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలు అభినందనీయం

కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్



జగనన్న కంటి వెలుగు పథకంలో కళ్లద్దాలను పంపిణీ చేసిన కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్

రాజానగరం: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు అభినందనీయమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయవలసిన అవసరం ఉందని చెప్పారు. ఇవి మంచి ఫలితాలను ఇస్తాయంటూ సీఎం ఆలోచన స్ఫూర్తినిస్తుందంటూ కితాబిచ్చారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి బుధవారం సందర్శించారు. ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించడం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈ సందర్భంగా జగనన్న కంటి వెలుగు పథకంలో లబ్ధిదారులకు కంటి అద్దాలను కేంద్ర మంత్రి అందజేశారు. తొలుత కలెక్టర్ కె.మాధవీలత జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టుల గురించి మంత్రికి వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం ప్రస్తుతం జిల్లాలో జరుగుతోందన్నారు. తొలి విడతలో 468 వైద్య శిబిరాలు నిర్వహించి, 231224 మందికి సేవలు అందించారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా లక్షా 82 వేల గృహాలను సందర్శించి, 108, 104 అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావో

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం పర్యవేక్షణలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.రాజ కుమార్, మహిళాభివృద్ధి శిశుసంక్షేమ సాధికారత అధికారి కె.విజయకుమారి మాట్లాడుతూ బాలికలు విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు బాలలను ప్రేమ పేరుతో వేధించినా, లైంగిక వేధింపులకు గురిచేసినా, బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారం తెలిసినా చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీసు 100కి, జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నబర్ 18004254156కి ఫోన్ చేసి సమాచారం అదించాలన్నారు. బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ పి.సూర్య ప్రభావతి మాట్లాడుతూ మనదేశంలో జాతీయ బాలికల దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24 న జరుపుకుంటున్నామన్నారు. 2008లో మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తీసుకున్న చొరవ కారణంగా ప్రతి సంవత్సరం జాతీయ బాలిక దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్రాలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కె.నాగలక్ష్మి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, శిశుగృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ

- రాష్ట్రవ్యాప్తంగా రూ.6,395 కోట్లు అందించాం
- మంత్రి వేణుగోపాలకృష్ణ



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న మంత్రి వేణు. చిత్రంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

కడియం: ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు నాలుగు విడతల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణమాఫీ చేశారని బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచారపౌర సంబంధాల శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,98,398 గ్రూపుల్లోని 79 లక్షల మంది మహిళా సభ్యులకు రూ.6,395 కోట్లు అందించామన్నారు. ఒక్క కడియం మండలంలోనే నాలుగు విడతల్లోనూ 1,538 స్వయం సహాయక సంఘాల్లోని 15,123 మంది సభ్యులకు రూ.44.23 కోట్ల రుణమాఫీ జరిగిందని మంత్రి వేణు అన్నారు. నాలుగో విడత ఆసరా కార్యక్రమాన్ని స్థానిక హైస్కూలు ఆవరణలో బుధవారం ఏర్పాటు చేశారు. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజానగరం శాసన సభ్యుడు జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులతో కలిసి మంత్రి వేణు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి వేణు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా సీఎం జగన్ పలు సంస్కరణలు చేపట్టారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు ఆగకుండా ప్రజలకు అందించామన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పావలా వడ్డీ అందిస్తే.. ఇప్పుడు సీఎం జగన్ హయాంలో ఆసరా పథకం ద్వారా పూర్తి రుణమాఫీ చేశారన్నారు. కానీ నమ్మి ఓట్లు వేసి అధికారం ఇచ్చిన ప్రజలను మోసం చేసిన ఘనత నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. ప్రజలు అధికారం ఇస్తే వారికి అందాల్సిన ప్రతి సంక్షేమ పథకంలో కోతలు పెట్టి, నానా ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. చంద్రబాబు రాక్షస పాలనకు భిన్నంగా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కాపు సామాజిక వర్గాన్ని మభ్యపెట్టేందుకు మాత్రమే పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు పక్కన పెట్టుకుంటున్నారన్నారు.

జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షిస్తూ సీఎం జగన్ అమ్మ ఒడి పథకం అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలను మోసం చేసిందన్నారు. కానీ జగన్ ప్రభుత్వం నాలుగు దశల్లో డ్వాక్రా రుణ మాఫీ చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 45–60 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలకు ఏడాదికి రూ.18,750లు అందిస్తూ.. నాలుగేళ్ళల్లో ఒక్కో మహిళకు రూ.75వేలు ఇచ్చారన్నారు. కాపునేస్తం పథకం ద్వారా రూ.15వేలు చొప్పున అందిస్తున్నారని రాజా అన్నారు. అనంతరం ఆసరా నాల్గవ విడత చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జక్కంపూడి రాజా, ఆకుల వీర్రాజులకు మంత్రి వేణు శాలువా వేసి సత్కరించారు. పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్రస్టాలిన్, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, సొసైటీ చైర్మన్‌లు తిరుమలశెట్టి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామ్, నర్సరీ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్న జనసేన వ్యాన్ అడ్డగింపు



శహపురం గ్రామంలో జనసేన పార్టీ ప్రచారం చేస్తున్న వ్యాన్

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనసేన పార్టీ వ్యాన్ ద్వారా దుష్ప్రచారానికి పాల్పడింది. స్థానికులు ఆ వ్యాన్ వద్దకు వెళ్లి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల గుండెల్లో కొలువైన ముఖ్యమంత్రిపై ఇలాంటి ప్రచారం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటన కాకినాడ జిల్లా పెదపూడి మండలం శహపురంలో బుధవారం జరిగింది. శహపురంలో ఈ నెల 22న సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వరరావు, శివ అనే ఇద్దరు వ్యక్తులు జనసేపార్టీ తరఫున వ్యాన్ ద్వారా ప్రచారం చేశారు. దీనిలో భాగంగా ఎల్‌ఈడీ ద్వారా దుష్ప్రచారం చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఈ నెల 23 స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వ్యాన్‌ను పోలీస్‌స్టేషనకు తరలించి వివరాలు సేకరించారు. సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ప్రచారం చేయాలని, ఎల్‌ఈడీ ద్వారా ప్రచారం చేయరాదని నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికి 24న మధ్యాహ్నం అదే శహపురం గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద ప్రచారం చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసి డ్రైవర్‌ను నిలదీశారు. ఈ నేపథ్యంలో ఇదే గ్రామానికి వచ్చిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వ్యాన్ వద్దకు వెళ్తుండగా స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు, జనసేన, టీడీపీ శ్రేణుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. వాగ్వాదం జరిగింది. వెంటనే స్థానిక ఎస్సై శోభన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. వ్యాన్‌డ్రైవర్, మరి కొంతమంది తమపై దాడి చేశారంటూ వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా తమపై దాడి చేశారంటూ వ్యాన్ డ్రైవర్, మరి కొంతమంది ఫిర్యాదు పోలీసులకు చేశారు.

క్లుప్తంగా

28న రాజమహేంద్రవరంలో హిందూ సంగమం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అయోధ్యలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేసిన సందర్భంగా ఈనెల 28వ మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ హిందూ సంగమం నిర్వహిస్తున్నట్లు శ్రీరామ ఉత్సవ సమితి ప్రతినిధులు వెల్లడించారు. ఆల్ ఇండియా హిందూ జాగరణ సమితికి చెందిన ఆలే శ్యాంకుమార్, కాకినాడ శ్రీపీఠం నిర్వాహకులు శ్రీ పరిపూర్ణానంద సరస్వతి సందేశం ఇస్తారన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ తన నడవడికతో ఎవరి పట్ల ఎలా ప్రవర్తించాలో తెలియజేసిన మర్యాద పురుషోత్తముడు రాముడని అన్నారు. అందుకే రామాయణం కల్పవృక్షంగా విరాజిల్లుతోందన్నారు. ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ అయోధ్యలో భారతీయ సమాజం సాధించిన విజయం అందరి సమన్వయంతో సిద్ధించిందన్నారు. సమితి అధ్యక్షుడు దినేష్ వైష్ణవ్, ఉపాధ్యక్షుడు గుండెపూడి సురేష్, కోశాధికారి బండ్ల రామ శంకర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తుని: స్థానిక రైల్వేస్టేషన్ కొండవారిపేట అండర్ పాసు వద్ద సుమారు 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న రైలు కింద తలపెట్టి ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కుడి చేతిపై రాజు అనే పచ్చబొట్టు ఉందని, పసుపు గళ్ల చొక్కా, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 94948 87786, 94906 19020 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నూతన విద్యావిధానం అమల్లో మనమే ప్రథమం

- దేశంలోనే ముందంజలో రాష్ట్రం
- వర్క్‌షాపులో నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు


మాట్లాడుతున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: నూతన విద్యా విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం 'సోషల్ ఇంజినీరింగ్ యాక్సెస్ అండ్ ఇన్క్లూజన్', 'యువసాధికారత – ఉపాధి' అనే అంశాలపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కరిక్యులమ్‌లో 30 శాతం స్కిల్ ప్రోగ్రామ్స్ ఉండటంతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతోందన్నారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు చదువుకునే సమయంలోనే ఇంటర్న్‌షిప్ చేసే అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై త్వరలో యూనివర్సిటీలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 'యువ సాధికారత – ఉపాధి' అనే అంశంపై బెంగళూరుకు చెందిన జేవీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెసర్ ఎస్ఎంకే భట్ట ఉపన్యసించారు. రాష్ట్రంలో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి కార్యక్రమాలతో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. 'సోషల్ ఇంజినీరింగ్ యాక్సెస్ అండ్ ఇన్క్లూజన్' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ లోకానందరెడ్డి ఐరాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. ఆచార్య కేఎస్ రమేష్ కన్వీనర్‌గా, డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి కో కన్వీనర్‌గా వ్యవహరించిన వర్క్‌షాప్‌లో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎమ్మెల్యే చిట్టిబాబు తనయుడి వివాహం


వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి వేణు, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

పి.గన్నవరం: స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తనయుడు వికాష్‌బాబు, అభిజ్ఞల వివాహ మహోత్సవం వాడ్రేవుపల్లిలో బుధవారం వైభవంగా జరిగింది. గటిగంటి వాసు ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయిల్, ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, పొన్నాడ సతీష్ కుమార్, జక్కంపూడి రాజా, రాపాక వరప్రసాదరావు, ఎలీజా, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, ఆర్డీఓ ఎం.ముక్కంటి, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్ పర్సన్ కుడుపూడి సత్యశైలజ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ కార్యక్రమానికి వచ్చేసిన అతిథులకు ఎమ్మెల్యే చిట్టిబాబు, లక్ష్మి దంపతులు స్వాగతం పలికారు.

పోక్సో కేసులో రెండున్నరేళ్ల జైలు

మధురపూడి: పోక్సో కేసులో కోరుకొండ మండలం నర్సాపురానికి చెందిన చింతపల్లి సుబ్బారావుకు రెండున్నరేళ్ల జైలు, రూ.1,250 జరిమానా విధిస్తూ పోక్సో స్పెషల్ కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. 2018 సెప్టెంబర్ 17వ తేదీ మధ్యాహ్నం బాధిత బాలిక గ్రామంలోని దుకాణం నుంచి ఇంటికి వెళుతుండగా సుబ్బారావు ఆమె చున్నీ పట్టుకుని లాగాడు. పక్కనే ఉన్న బాలిక పెద్దమ్మను తీవ్రంగా కొట్టాడు. వారిద్దరి ఫిర్యాదు మేరకు సుబ్బారావుపై అప్పటి ఏఎస్సై రామన్న దొర కేసు నమోదు చేశారు. ఎస్సై ఆర్.శివాజీ దర్యాప్తు చేసి, కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు పర్చారు. జిల్లా పోక్సోకోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు బలమైన వాదనలు వినిపించడంతో నిందితుడి నేరం రుజువైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై వేధింపుల పాల్పడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

రౌడీ షీటర్‌కు రెండేళ్ల జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎస్సైపై దాడి చేసిన రౌడీషీటర్‌కు రెండేళ్ల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా.. 2022 మార్చి రెండో తేదీన త్రీటౌన్ ఎస్సై పి.అప్పారావు పెండింగ్ కేసు విషయంలో గుజ్జల రామకృష్ణ ఇంటికి వెళ్లారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అతడిని స్టేషన్‌కు రావాలని చెప్పారు. దీంతో ఎస్సైపై గుజ్జల రామకృష్ణ వెదురుబొంగుతో దాడి చేశాడు. తనను పట్టుకోవడానికి ప్రయత్నించిన కానిస్టేబుల్ అశోక్‌పై బటన్ నైఫ్‌తో దాడి చేశాడు. ఎస్సై అప్పారావు ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. జిల్లా ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదనలు వినిపించారు. గుజ్జల రామకృష్ణపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పునిచ్చారు.

జీవితాల్లో వెలుగులు



డ్వాక్రా మహిళలకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి నాలుగు విడతలుగా రుణమాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్ మా జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ రుణమాఫీ సొమ్ముతో ఆర్థిక అవసరాలు తీర్చుకుని స్వయం సమృద్ధిని సాధిస్తున్నాం. మహిళల సంక్షేమానికి జగన్ అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. వైఎస్సార్ ఆసరాతో రూ.63,500 లబ్ధి పొందాను.



– గుత్తుల విజయ రామతులసి, విజయజ్యోతి ఎంఎస్ఎస్, పెదపళ్ల, ఆలమూరు

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరగనుంది. ఈ విషయాన్ని జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రగతిని ప్రధాన అజెండాగా సమీక్షిస్తామన్నారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

వివాహిత ఆత్మహత్య


సుజాత మృతదేహం

మామిడికుదురు: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మామిడికుదురులో బుధవారం జరిగింది. నగరం ఎస్సై పి.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మెండా సుజాత (29) ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించే భర్త వెంకటేశ్వరరావు ఉదయం బయటకు వెళ్లిన తర్వాత ఈ ఘటన జరిగింది. స్థానికులు ఫోన్‌లో ఈ విషయాన్ని వెంకటేశ్వరరావుకు చెప్పారు. అతను హుటాహుటీన ఇంటికి వచ్చి సుజాతను కిందికి దింపి పేరూరు వై.జంక్షన్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. యానాం సమీపంలోని మల్లవరానికి చెందిన సుజాతకు మామిడికుదురుకు చెందిన వెంకటేశ్వరరావుతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల హేమసత్యసాయి, ఏడాదిన్నర వయసున్న నవదీప్ ఉన్నారు. మృతురాలి తల్లి గంగిరెడ్డి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాపం పసివాళ్లు...

- ఉమ్మెత్తకాయలు తిని 8 మంది చిన్నారులకు అస్వస్థత
- ఇద్దరి పరిస్థితి విషమం
- నల్లజర్ల మండలం పోతవరంలో ఘటన


జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులు


చిన్నారులు తిన్న కాయలు ఇవే..

నల్లజర్ల: అభం శుభం తెలియని ఆ చిన్నారులు ఆడుకుంటూ తమ నివాసం సమీపంలోని ఉమ్మెత్త చెట్టు కాయలు తిని అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పిల్లుట్ల, నాగవరం తదితర గ్రామాల నుంచి 11 కుటుంబాలు పోతవరంలోని వర్జీనియా పొగాకు క్యూరింగ్ పనులకు వచ్చాయి. రైతులు అబ్బూరి దొరబాబు, కానూరి అమ్మిరాజు పొలంలో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని, పొగాకు కొట్టు పనులు చేస్తున్నాయి. యథావిధిగా బుధవారం పొగాకు పనులకు వెళ్లగా మకాంలోని 8 మంది పిల్లలు మధ్యాహ్న సమయంలో ఆడుకుంటూ ఎదురుగా ఉన్న పాత్రుని చెరువు గట్టున ఉన్న ఉమ్మెత్తి చెట్టు కాయలను తిన్నారు. పెద్దలు పని ముగించుకుని సాయంత్రం 4 గంటలకు మకాం వద్దకు వచ్చేసరికి పిల్లలందరూ వాంతులు చేసుకోవడాన్ని గమనించారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు. పిల్లలందరూ మూడు, నాలుగేళ్ల చిన్నారులే.

రైలు నుంచి జారిపడి జార్ఖండ్ వాసి మృతి


మృతి చెందిన సరోట దేవి

తుని: గొల్లప్రోలు-రావికంపాడు మధ్యలో రైలు నుంచి జారిపడి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సరోటదేవి (40) మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్.కె.అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సరోటదేవి హాటియా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ రావికంపాడు స్టేషన్ సమీపంలో ప్రమాదశాత్తూ రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు కుటుంబ సభ్యులు తుని జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చోరీ జరిగిన 24 గంటల్లో దొంగ అరెస్టు

- రూ. 4 లక్షల విలువైన బంగారు వస్తువుల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు. చిత్రంలో ఇన్‌స్పెక్టర్ తిలక్, పోలీసు సిబ్బంది

కడియం: చోరీ జరిగిన 24 గంటల్లోనే దొంగను అరెస్టు చేసి, రూ.4 లక్షల విలువైన బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని దక్షిణ మండల డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కడియపులంక గ్రామానికి చెందిన పుల్లా పెద సత్యనారాయణ తమ ఇంట్లోని 20.50 కాసుల విలువైన 9 బంగారు వస్తువులు కనిపించడం లేదని ఈనెల 22న కడియం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, అనుమానితులను విచారించారు. అదే ఇంట్లో దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్న బుర్రిలంక గ్రామానికి చెందిన పల్లా బాబీపై అనుమానం వచ్చి, అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు రెండేళ్లుగా అదే ఇంట్లో పనిచేస్తూ దఫదఫాలుగా దొంగతనం చేస్తున్నట్లు అంగీకరించాడు. వాటిలో నెమలి ఆకారం కలిగిన బ్రాస్లెట్, ఒక నల్లపూసల తాడును మాత్రం తన వద్ద ఉంచుకుని, మిగిలిన ఏడు బంగారు వస్తువులను వివిధ బ్యాంకుల్లో తనఖాపెట్టినట్లు ఒప్పుకున్నాడు. కడియపులంక, బుర్రిలంక, అమలాపురాల్లోని పలు బ్యాంకుల్లో ఈ వస్తువులు ఉన్నట్లు తమ సిబ్బంది గుర్తించారని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పల్లా బాబీని మంగళవారం అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పర్చగా, రిమాండు విధించారన్నారు. చోరీ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ తిలక్, సిబ్బంది సురేష్, రవికుమార్, భీమారావు, కుమార్‌ను అభినందించారు.

